సాక్షి
అనకాపల్లి
మంగళవారం । 8 । ఆగస్టు । 2023



సంతృప్తికర పరిష్కారం

జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ వారం కలెక్టరేట్‌కు 327 అర్జీలు వచ్చాయి. 8లో



అప్పన్న హుండీ లెక్కింపు

విశాఖ: సింహాచలేశుని హుండీ ఆదాయం గడిచిన 34 రోజులకు రూ.1.70 కోట్లు వచ్చినట్టు ఈవో వి.త్రినాథరావు తెలిపారు.

స్థానిక ఉప ఎన్నిక నగారా



జిల్లాలో ఖాళీగా ఉన్న 2 సర్పంచ్‌లు, 26 వార్డు సభ్యుల స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదలయింది. 10వ తేదీ వరకు నామినేషన్ల గడువు. 19న పోలింగ్, లెక్కింపు, ఫలితాలు తేలనున్నాయి. 8లో



అల్లూరి సీతారామరాజు జిల్లా కూనవరంలో సీఎం సభకు హాజరైన వరద బాధితులు, పోలవరం నిర్వాసితులు



మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

అండగా ఉంటా.. ఆదుకుంటా..

ఎవరూ అధైర్యపడవద్దు, మీకు నేను అండగా ఉంటా.. అందరికీ న్యాయం చేయడం నా బాధ్యత
- ఇది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా

మీరే న్యాయం చేస్తారు.. మీరైతేనే న్యాయం చేస్తారు.. రాజన్న బిడ్డపై మాకు అంత నమ్మకం
- ఇది వరద బాధితులు, పోలవరం నిర్వాసితుల విశ్వాసం

- వరద బాధితుల్లో ధైర్యం నింపిన ముఖ్యమంత్రి
- పోలవరం నిర్వాసితులకు గట్టి హామీ
- కూనవరం, వీఆర్‌పురం, చింతూరుల్లో పర్యటన
- నాలుగు గంటలపాటు బాధితులతో గడిపిన వైఎస్ జగన్
- వారి సమస్యలను విని కొండంత భరోసానిచ్చిన సీఎం
- అడుగడుగునా ఆత్మీయ పలకరింపుతో పులకించిన గిరిజనం



బాధితుల మాటలను శ్రద్ధగా ఆలకిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై హోం మంత్రి వనిత, ఎమ్మెల్యేలు ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, కలెక్టర్ సుమిత్‌కుమార్

సాక్షి, విశాఖపట్నం/చింతూరు: ముఖ్యమంత్రి మాటలు వారిలో కొండంత ధైర్యం నింపాయి. వరదల వల్ల ఏటా మీరు పడుతున్న బాధలను స్వయంగా చూస్తున్నా.. అందుకే లిడార్ సర్వే ద్వారా మరికొన్ని గ్రామాలను ప్రాధాన్యత క్రమంలో చేర్చి పరిహారం అందించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆయన చెప్పగానే నిర్వాసితులు హర్షధ్వానాలు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విలీన మండలాల ప్రజల్లో ఉత్సాహం నింపింది. ఆయన ప్రసంగం వరద బాధితులతోపాటు పోలవరం నిర్వాసితులకు కొండంత భరోసానిచ్చింది. 'నాన్నగారి హయాంలో రూ 1.15 లక్షల పరిహారం ఇచ్చిన రైతుల భూములకు గతంలో నేను చెప్పినట్లుగా రూ.5 లక్షలు ఇస్తాను.. త్వరలోనే మరో రూ 3.85 లక్షలు రైతులకు అందచేస్తాను' అని సీఎం చెప్పడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. న్యాయం చేసేందుకు మీ బిడ్డ ముఖ్యమంత్రి స్థానంలో కూర్చున్నాడని, మీకు తప్పకుండా బాధల నుంచి విముక్తి కలిగిస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాటలతో నిర్వాసితుల్లో ఆనందం వెల్లివిరిసింది.

అడుగడుగునా ధైర్యం నింపుతూ..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ఉదయం 10.50 గంటలకు కోతులగుట్ట హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ 20 నిమిషాలపాటు వరదలకు సంబంధించిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించి, ప్రజా ప్రతినిధులతో ముచ్చటించారు. 11.15కు హెలిప్యాడ్ వద్ద నుంచి బస్సులో బయలుదేరి 11.40కు కూనవరం బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకున్నారు. అక్కడ కూనవరం, వి.ఆర్.పురం, చింతూరు, ఎటపాక మండలాలకు చెందిన వరద బాధిత కుటుంబాలను పరామర్శించి సహాయక చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. బాధితుల సమస్యలు విన్నారు. పరిహారం అందరికీ అందిందా.. అని అడిగారు. లేనిపక్షంలో ఇక్కడికి వచ్చి చెప్పండని ఆహ్వానించారు. దీనిపై స్థానికులు తమకు వరద పరిహారం అందిందని బదులిచ్చారు. అయితే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి త్వరగా అందించాలని కోరారు. దీనిపై సీఎం జగన్ స్పందిస్తూ ఇదే విషయాన్ని ఇప్పటికే కేంద్రం దృష్టికి తీసుకువెళ్లానని తెలిపారు. గోదావరి, శబరి నదుల అనుసంధాన ప్రాంతం కావడంతో బ్యాక్ వాటర్ ఎక్కువగా వచ్చి పంటలు మునుగుతున్నాయని, ఏడాదికి ఒక పంట కూడా వేయలేని పరిస్థితి నెలకొంటుందని, దీనిపై తమకు ప్రభుత్వం సాయం అందించాలని బాధితులు కోరారు. పోలవరం ముంపునకు గురయ్యే పంటలకు సొసైటీల ద్వారా రుణాలు ఇప్పించాలన్నారు. సబ్సిడీ మీద రైతులకు ఇచ్చే యంత్రాలు ఇప్పించాలన్నారు. దీనిపై సీఎం స్పందిస్తూ వెంటనే దీనిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆదేశించారు. సభావేదిక వద్ద పలువురి నుంచి వినతులు స్వీకరించారు. ఒక్కో కుటుంబానికి రూ.2 వేల పరిహారంతో పాటు కుటుంబానికి 25 కేజీల ఉచిత బియ్యం ఇచ్చారు. వరదల్లో బాధితుల ఇళ్లకు నష్టం జరిగితే రూ.10 వేల పరిహారం అందిస్తున్నామన్నా రు. వరద బాధిత గ్రామాలను గతంలో ఎప్పుడూ ఇ లా ఆదుకున్నది లేదని బాధితులు మనోగతం వెల్లడించారు. ఏ పూటా లోటు రానివ్వలేదు. ముంపులో ఉన్నా అన్నీ అందించారన్నారు. సీఎం అక్కడ నుంచి మధ్యాహ్నం 1.50 గంటలకు బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రజాప్రతినిధులతో ముచ్చటించారు. 3.05కు హెలికాప్టర్‌లో బయలుదేరి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలం గొమ్ముగూడెం వెళ్లారు.



చిన్నారులతో కరచాలనం

భారీ బందోబస్తు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటుచేశారు. కోతులగుట్టలోని హెలిప్యాడ్ నుంచి కూనవరంలోని సభాస్థలి వరకు దారి పొడవునా బారికేడ్లు ఏర్పాటు చేశారు. డీఐజీ హరికృష్ణ, ఎస్పీ తుహిన్ సిన్హా బందోబస్తును పర్యవేక్షించారు. అడిషనల్ ఎస్పీ అనిల్‌కుమార్, పార్వతీపురం మన్యం అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్, చింతపల్లి అడిషనల్ ఎస్పీ ప్రతాప్ శివకిషోర్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సత్తిరాజు, రంపచోడవరం ఓఎస్డీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీలు రాహుల్ మీనా, సునీల్‌సారేన్, జగదీష్ అడహళ్లి బందోబస్తులో పాల్గొన్నారు. 674 మంది సివిల్ పోలీసులు, సీఆర్పీఎఫ్ బలగాలు బందోబస్తు నిర్వహించాయి.

ముఖ్యమంత్రికి ఘన స్వాగతం

సాక్షి, పాడేరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి సోమవారం కూనవరం మండలం కోతులగుట్ట హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ సుమిత్‌కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు, జిల్లా పార్టీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఇతర ప్రజాప్రతినిధులు, నేతలు ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆయనతోపాటు హెలికాప్టర్ దిగిన హోంశాఖ మంత్రి తానేటి వనితకు కూడా ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి భద్రాచలం సీతారాముల ఇత్తడి ప్రతిమను అందజేశారు.



నేనున్నాను : భరోసా ఇస్తున్న సీఎం జగన్



చల్లగా ఉండు : అవ్వ దీవెన

కలెక్టర్ బాగా పనిచేశారు

గతేడాది, ఈ ఏడాది వచ్చిన వరదల సమయంలో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎంతో బాగా పనిచేశారు సార్.. మేము ఇక్కడి నుంచి వెళ్లే వరకు కలెక్టర్ గారు ఈ జిల్లాలోనే ఉండేలా చూడండి సార్.. అంటూ వరద బాధితులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో అన్నారు. 'వరదలు అడ్డంకిగా ఉన్నందున కలెక్టర్ గారు మా ఊరికి రాలేదు సార్' అని వీఆర్‌పురం మండలం అడవి వెంకన్నగూడేనికి చెందిన మహిళ చెప్పగానే.. వరదలు తగ్గాయి కదా కలెక్టర్ గారూ.. ఒకసారి ఆ ఊరు వెళ్లి రండంటూ ముఖ్యమంత్రి సూచించారు. ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు వరదల సమయంలో ముందస్తుగా చర్యలు చేపట్టారని, సహాయక చర్యలు ముమ్మరంగా జరిగేలా చూశారని వరద బాధితులు సీఎంకు వివరించారు. తన తల్లి ఆరోగ్యం సరిగా లేకున్నందున సీఎంవో కార్యాలయానికి వస్తే సీఎం సహాయ నిధి నుంచి రూ.2 లక్షల ఆర్థికసాయం అందివ్వడంతో వైద్యం చేయించగలిగానని కూనవరం మండలం చినార్కూరుకు చెందిన సున్నం అభిరాం సీఎం కృతజ్ఞతలు తెలిపాడు.

ఎస్‌ఐని భుజం తట్టి అభినందించిన సీఎం

గత ఏడాది, ఈఏడాది వచ్చిన గోదావరి వరదల్లో సాహసోపేతంగా రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన కూనవరం ఎస్‌ఐ బి.వెంకటేష్‌ను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. హెలిప్యాడ్ నుంచి కూనవరంలో వరద బాధితులతో ఏర్పాటు చేసిన సభకు హాజరవుతున్న సందర్భంలో ఒక విజ్ఞాపన కోసం సీఎం బస్సుదిగారు. అదే సమయంలో అక్కడున్న స్థానికులు అధికారులు ఎస్‌ఐ బాగా పనిచేశారని సీఎంకు చెప్పారు. ఎస్‌ఐ వెంకటేష్ రెస్క్యూ ఆపరేషన్ సాహసంగా నిర్వహించారని, గత ఏడాది భీకరంగా వచ్చిన గోదావరి వరదల్లో కూనవరం సమీపంలోని దాదాపు నాలుగు వేల నుంచి ఐదు వేలమంది గ్రామస్తులను తరలించడంలో కీలకపాత్ర పోషించారని సీఎం ఎదుట పలువురు మెచ్చుకున్నారు. అదే సమయంలో అక్కడే విధులు నిర్వహిస్తున్న వెంకటేష్‌ను సీఎం భుజం తట్టి అభినందించారు. మెడల్ ఇవ్వాలని సిఫార్సు చేశారు.



కష్టకాలంలో చేయూత

సీఎంతో వరదబాధితుల ముఖాముఖి

కూనవరం/వీఆర్‌పురం: గోదావరి వరదల్లో జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, చింతూరు డివిజన్ అధికార యంత్రాంగం పదిరోజులపాటు ముంపు ప్రాంతాల్లోనే ఉంటూ సహాయ సహకారాలు అందించారని, వారి సేవలు మరువలేనివని పలువురు బాధితులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డితో జరిగిన ముఖాముఖిలో పలువురు మాట్లాడారు. కష్టకాలంలో ప్రభుత్వపరంగా సాయం అందించి ఆదుకున్నారని వారు పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు.

వరదకు ముందే తరలింపు



గతంలో ఆకస్మికంగా సంభవించిన గోదావరి వరదలకు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఈ ఏడాది గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని అధికారయంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. కలెక్టర్, చింతూరు ఐటీడీఏ పీవో లోతట్టు ప్రాంతాల నుంచి పునరావాస ప్రాంతాలకు తరలించి బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరకులు, టార్పాలిన్లు అందించారు. – కట్టం లక్ష్మి, కొండ్రాజుపేట పంచాయతీ, శబరి కొత్తగూడెం

నవరత్నాలు ఆదుకున్నాయి



ప్రతీ ఏటా జూన్, జూలై నెలల్లో సంభవించే వరదల వల్ల అనేక విధాలుగా నష్టపోతున్నాం. ఈ పరిస్థితుల్లో నవరత్నాల పథకాలు ఎంతగానో తమను ఆదుకున్నాయి. పనులు లేక ఇబ్బందులు పడుతున్న కష్టకాలంలో ఆర్థికంగా ఆదుకున్నాయి. ప్రాధాన్యత ఉన్న గ్రామాలకు ఆర్అండ్ఆర్ ఇచ్చి పంపించాలి.
– కొమ్మాని సునీత, కూనవరం

గోకవరం వద్దే పునరావాసం కల్పించాలి



మా గ్రామానికి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడ్వాయిలో పునరావాస కాలనీ నిర్మిస్తామని అధికారులు చెప్పారు. నిత్యం కూలిపనులకు వెళ్లి జీవనం సాగిస్తున్న మాకు అక్కడ పని దొరికే పరిస్థితి లేనందున గోకవరం మండలంలో పునరావాసం కల్పించాలని కోరుకుంటున్నాం. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచించాలి.
– వద్దానపు రజని, చింతరేగుపల్లి, వీఆర్‌పురం మండలం

ఏడుగురాళ్లపల్లి రహదారి నిర్మించాలి



వరదల సమయంలో అత్యవసర సేవలు అందించేందుకు అనువుగా ఉన్న కోతులగుట్ట–ఏడుగురాళ్లపల్లి రహదారిని నిర్మించాలి. వీఆర్‌పురం మండలంలోని అన్నవరం–పెదమట్టపల్లి మీదుగా తులసిపాక వరకు ఉన్న రహదారిని కూడా నిర్మిస్తే వరదల సమయంలో చాలా వరకు రోడ్డు కనెక్టివిటీ ఏర్పడుతుంది.
– ఉండవల్లి గాంధీబాబు, రేఖపల్లి, వీఆర్‌పురం మండలం

ఆర్ అండ్ ఆర్ సభలు వేగవంతం



ముంపు గ్రామాల్లో అధికారులు ఆర్అండ్ఆర్ గ్రామ సభలను వేగంగా నిర్వహిస్తున్నారు. త్వరితగతిన స్ట్రక్చర్ వాల్యూ, ఆర్అండ్ఆర్ అందించాలి. అధికారులు, ప్రభుత్వం ఈదిశగా చర్యలు చేపడితే వరద బాధితులు సమస్యలు పరిష్కారమవుతాయి. దీనిపై దృష్టి పెట్టమని సీఎంను కోరుతున్నాం.
– పిట్టా రామారావు, సర్పంచ్ చినమట్టపల్లి

ఎన్నడూ లేని విధంగా నిత్యావసరాల పంపిణీ



ఎన్నడూలేనివిధంగా ఈ ఏడాది నిత్యావసర సరకులను ప్రభుత్వం అందించింది. ముంపుతో సంబంధం లేకుండా ప్రతీ కుటుంబానికి కలెక్టర్ ,మండల స్థాయి అధికారులు రూ.2 వేలు తక్షణ సహాయం అందించారు. అలాగే వరద ముంపు కారణంగా దెబ్బతిన్న ఇళ్లకు పరిహారమివ్వడం ఎంతో సంతోషంగా ఉంది.
– సున్నం అభిరామ్, సర్పంచ్ చినార్కూరు, కూనవరం మండలం

కాంటూరుతో సంబంధం లేకుండా పరిహారం



పోలవరం ముంపు బాధితులకు కాంటూరుతో సంబంధం లేకుండా పరిహారం ఇప్పిస్తే అన్ని గ్రామాల్లోని ప్రజలకు ఊరట లభిస్తుంది. గతంలో వచ్చిన వరదలకు మునిగిన గ్రామాలు అన్నింటికీ పరిహారం ఇవ్వాలి. తాము చాన్నాళ్లుగా ఇదే కోరుకుంటున్నాం. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.
– కారం పార్వతి, సర్పంచ్ జగ్గవరం, కూనవరం మండలం

అదనపు పరిహారం ఇవ్వాలి



గతంలో పోలవరం భూ పరిహారం కింద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఐదు ఎకరాలు మినహాయించి ఆపైఉన్న భూములకు రూ.1.15 లక్షలు ఇచ్చారు. వీటికి అదనంగా చెల్లిస్తామన్న రూ.3.85 లక్షల పరిహారాన్ని ఐదు ఎకరాల లోపు భూములు కలిగిన గిరిజన రైతులకు కూడా చెల్లించాలని కోరుతున్నాం
– కుంజా శ్రీను, శబరికొత్తగుడెం ,కూనవరం మండలం

మా గ్రామాన్ని పోలవరం ముంపు సర్వేలో చేర్చాలి



మాగ్రామం చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ఆర్అండ్ఆర్ గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. అయితే మా గ్రామాన్ని మినహాయించారు. వెంకన్నగూడెంను కూడా ముంపు గ్రామంగా ప్రకటించి సర్వే చేయించాలి. ఈ దిశగా చర్యలు చేపట్టి ఆదుకోవాలి.
– కారం కన్నమ్మ, వెంకన్నగూడెం,కూనవరం మండలం

రైల్వే స్టేషన్లలో మౌలిక వసతులకు కృషి

- ప్రశాంతి, రత్నాచల్, జన్మభూమి హాల్ట్‌కు చర్యలు
- జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు శ్రీనివాసాచార్యులు



రైల్వే స్టేషన్ సమస్యలను జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడికి వివరిస్తున్న న్యాయవాదులు

యలమంచిలి/ఎస్.రాయవరం: యలమంచిలి, నర్సీపట్నం రైల్వే స్టేషన్‌లో మౌలిక వసతుల మెరుగు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(జెడ్‌ఆర్‌యూసీసీ) సభ్యుడు పూడి శ్రీనివాసాచార్యులు అన్నారు. డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ(డీఆర్‌యూసీసీ) సభ్యుడు జీవీ శర్మతో కలిసి సోమవారం ఆయన యలమంచిలి, నర్సీపట్నం రైల్వే స్టేషన్లను సందర్శించారు. ఆయా స్టేషన్లలో నెలకొన్న సమస్యలపై యలమంచిలి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు, ఎస్.రాయవరం మండల ప్రజలు వారి దృష్టికి తీసుకువెళ్లారు. వినతిపత్రాలు అందించారు. మరుగుదొడ్లు, తాగునీటి వసతి, రైల్వే టైమింగ్స్ డిజిటల్ బోర్డులు, విశాఖ వెళ్లే పాసింజర్ రైళ్ల పునరుద్ధరణ, ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం తదితర సమస్యలను విన్నవించారు. రత్నాచల్, ప్రశాంతి, జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రైళ్లను యలమంచిలి, నర్సీపట్నంలలో నిలుపుదల చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణీకుల ద్వారా ఆదాయం బాగుందని, అదే స్థాయిలో వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్ల నిలుపుదల ప్రతిపాదనలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వేగంగా చర్యలు తీసుకుంటామన్నారు. వినతి పత్రాలు అందించిన వారిలో న్యాయవాదులు కొల్లూరి లక్ష్మీనరసింహం, ధూళి నూకరాజు, శ్రీనివాస పట్నాయక్, మైలారు శ్రీనివాసరావు, రమణ, వెంకట్రావు, సత్తిబాబు తదితరులున్నారు.

వందే భారత్‌కు అనకాపల్లిలో హాల్ట్ కల్పించాలి:ఎంపీ వినతి

అనకాపల్లిటౌన్: వందే భారత్ రైలుకు అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో హాల్టు కల్పించాలని సోమవారం జరిగిన పార్లమెంట్ సమావేశంలో ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి కోరారు. తన నియోజకవర్గంలో అనకాపల్లికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. పర్యాటకంగా కూడా అభివృద్ధి చెందుతోందన్నారు. నర్సీపట్నం, తుని, యలమంచిలి తదితర ప్రాంతాల నుంచి నిత్యం అనేక మంది రైలు ప్రయాణం చేసేందుకు అనకాపల్లి స్టేషనే ప్రధానమన్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్–విశాఖపట్నం మధ్య రాకపోకలు సాగించేవారు ఎక్కువగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అనకాపల్లి స్టేషన్‌లో వందే భారత్ రైలుకు హాల్టు కల్పించాలని కోరారు.

చేనేత వస్త్రాలతో ఆరోగ్యం, సౌకర్యం

జాతీయ చేనేత దినోత్సవంలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



చేనేత కార్మికులను సత్కరిస్తున్న కలెక్టర్

తుమ్మపాల: చేనేత వస్త్రాలు శరీర ఉష్ణోగ్రత సమతుల్యతతోపాటు, దేహానికి ఆరోగ్యాన్ని, సౌకర్యాన్ని కలిగిస్తాయని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన చేనేత వస్త్రాల ప్రదర్శనను నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నేతన్న నేస్తంలాంటి అనేక పథకాలను అమలు చేస్తోందన్నారు. స్వదేశీ ఉద్యమానికి గుర్తుగా ప్రతి సంవత్సరం చేనేత దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆప్కో ఏడీ మురళీకృష్ణ మాట్లాడు తూ మన దేశంలో ప్రాచీన కాలం నుంచి చేనేత వస్త్రాలు తయారవుతున్నాయని, వస్త్రాల నేతలో చేనేత కళాకారులు చాలా రికార్డులు నెలకొల్పారన్నారు. అంతకుముందు పాయకరావుపేటకు చెందిన చేనేత కార్మికులు జీవీ నాగేశ్వరరావు, ఆర్.సుబ్రమణ్యంలను కలెక్టర్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో చేనేత సంఘాల అధ్యక్షులు ఎస్.నూరిబాబు, సీహెచ్ సత్యనారాయణ, పంపాన సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి డి.ఈశ్వరరావు, కోఆప్షన్ సభ్యులు కె.ప్రభావతి, వాణిజ్య విభాగం అధ్యక్షుడు వానపల్లి ఈశ్వరరావు, డీవో సునీల్, రాజారత్నం, ఈశ్వరి పాల్గొన్నారు.

ఫౌండేషన్ విత్తనంతో మంచి విత్తనాల ఉత్పత్తి

చోడవరం రూరల్/దేవరాపల్లి: ప్రభుత్వం అందించిన ఫౌండేషన్ విత్తనాన్ని సరైన యాజమాన్య పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా మంచి సర్టిఫైడ్ విత్తనాలను ఉత్పత్తి చేయవచ్చని అనకాపల్లి జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వి.తులసీమణి తెలిపారు. సోమవారం చోడవరం మండలంలోని ఖండేపల్లి, దేవరాపల్లిలోని బోయిలకింతాడ, వేచలం గ్రామాల్లో జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో గ్రామీణ విత్తనోత్పత్తిపై రైతులకు శిక్షణ ఇచ్చారు. సొంతంగా విత్తనాలు తయారు చేసుకుంటే ప్రైవేట్ వ్యాపారుల చేతిలో మోసపోయే పరిస్థితి ఉండదన్నారు. ఖరీఫ్ వరి నాట్లు వేసే రైతులు నారు చివర్లను తుంచి నాట్లు వేసుకుంటే, పురుగుల బెడద తగ్గుతుందన్నారు. కాలిబాటలు వదిలితే పంటకు దోమపోటు, తెగుళ్లు సోకకుండా నివారించవచ్చన్నారు. శిక్షణలో సర్పంచ్ శానాపతి రాజశేఖర్, మండల వ్యవసాయ అధికారు ఇ.పావని, వై.కాంతమ్మ, జిల్లా వనరుల కేంద్రం ఏఈవో ఎన్.సాయివాణి, మండల వ్యవసాయ విస్తరణాధికారి ఎస్.కిరణ్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు డి.ప్రీతి కావేరి, బి.కిరణ్, గ్రామీణ విత్తనోత్పత్తి పథకం లబ్ధిదారు రైతులు పాల్గొన్నారు.



రైతులకు శిక్షణ ఇస్తున్న వ్యవసాయాధికారి

10న పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సు

తుమ్మపాల: జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 10న ఉదయం 11 గంటలకు యలమంచిలి మండల కార్యాలయం వద్ద పరిశ్రమల స్థాపనపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల అధికారి జీఎం శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఔత్సాహికులు పరిశ్రమల స్థాపనలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతన అవకాశాలను ఈ సదస్సు ద్వారా తెలుసుకోవచ్చన్నారు. ప్రముఖ పరిశ్రమలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొని పలు అంశాలను వివరిస్తారని తెలిపారు.

తీరనున్న బీఎన్ రోడ్డు ప్రయాణికుల కష్టాలు

ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

చోడవరం రూరల్: గత ప్రభుత్వ నిర్వాకం ఫలితంగా ఇంతకాలంగా భీమునిపట్నం–నర్సీపట్నం రోడ్డులో పలు చోట్ల పడిన గుంతల నుంచి త్వరలోనే ప్రయాణికులకు మోక్షం కలుగుతుందని ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. సోమవారం పట్టణ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఆయా గ్రామాల కూడళ్లలో వాడకం నీరు ఫలితంగా ఈ రోడ్డు పూర్తిగా దెబ్బతిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని మండలంలోని వెంకన్నపాలెం జంక్షన్, గోవాడ జంక్షన్, చోడవరం, విజయరామరాజుపేట గ్రామాల్లో రూ.10 కోట్లతో, రావికమతం జంక్షన్ నుంచి థియేటర్ వరకు రూ.2 కోట్లతో, ఎల్.సింగవరం నుంచి పొట్టిదొరపాలెం వరకు రూ. 2.5 కోట్లతో సీసీరోడ్లు, సీసీడ్రైనేజీల నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభిస్తారన్నారు. అనంతరం తారు రోడ్డు నిర్మాణం పూర్తి చేస్తారన్నారు. ఇప్పటికే వడ్డాది జంక్షన్‌లో ఇటువంటి నిర్మాణం పూర్తయిందని, దెబ్బతిన్న పెద్దేరు నది వంతెన స్థానే డైవర్షన్ రోడ్డు సైతం పూర్తి చేసిన సంగతి గుర్తు చేశారు. ఈ పనులన్నీ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తనకు అందిన ప్రజా వినతులేనని స్పష్టం చేశారు. చోడవరం మండలం జన్నవరంలో మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలికల పాఠశాల భవనాల నిర్మాణానికి రూ.35 కోట్లు, వెంకన్నపాలెంలో పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణానికి రూ.17 కోట్లు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. ఇవే గాకుండా ఆయా మండలాల్లో అనేక లింకు రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్టు తెలిపారు.రూ. 2.8 కోట్లతో పి.ఎస్.పేట రోడ్డు, రూ.2.6 కోట్లతో లక్కవరం సింహాద్రిపురం రోడ్డు, రూ.80 లక్షలతో అంకుపాలెం రోడ్డు నిర్మాణ పనులు చేపడతారని చెప్పారు. బంగారుమెట్ట జంక్షన్ నుంచి కశింకోట రోడ్డు రూ.32 కోట్లతో చేపట్టి దాదాపు పూర్తి కావస్తుందని, ఈ రీతిలో నియోజకవర్గంలో రోడ్ల సమస్యకు తావు లేకుండా చేస్తామని విప్ ధర్మశ్రీ ధీమాగా చెప్పారు.

13న చోడవరంలో గడప గడపకు ముగింపు సభ

ఈ నెల 13న చోడవరంలో 'గడపగడప'కు ముగింపు విజయోత్సవ సభ నిర్వహించనున్నట్టు ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ వెల్లడించారు. 86 గ్రామ సచివాలయాల పరిధిలో ఈ కార్యక్రమాన్ని 213 రోజుల్లో పూర్తి చేశామన్నారు. వారి నుంచి వచ్చిన ప్రజా సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తున్నట్టు తెలిపారు. ఈ సభకు పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. సమావేశంలో నియోజకవర్గ నూతన పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, పార్టీ నాయకులు ఓరుగంటి నెహ్రూ, బి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

ఐటీడీఏ సేవలు వర్తింపజేయాలని వినతి

తుమ్మపాల: ఐదో షెడ్యూల్ సాధన సమితి, అఖిల భారత ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో నర్సీపట్నం నుంచి ఈ నెల 4న ప్రారంభమైన పాదయాత్ర అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌కు సోమవారం చేరుకుంది. అక్కడ కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిని కలిసి జిల్లాలోని నాన్ షెడ్యూల్డ్, షెడ్యూల్డ్ ప్రాంతాల ఆదివాసీలకు ఐటీడీఏ సేవలు వర్తించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ రైతులు వినతి పత్రం అందించారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో ఐటీడీఏ సేవలను గిరిజనులు కోల్పోయారని, మన్యంలో మైదాన గిరిజన గ్రామాలను విలీనం చేయకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా సాగులో ఉన్న భూములను ఆన్‌లైన్ చేసి ఏకపక్షంగా ఇతరుల పేర్లతో మార్చేస్తున్నారని వాపోయారు. భూసమస్యలతో సతమతమవుతున్న గిరిజన రైతులతో రెవెన్యూ అధికారులు, కలెక్టర్‌తో ముఖాముఖి నిర్వహించాలని కోరారు.

మోగిన స్థానిక ఉప ఎన్నికల నగారా

- ఖాళీ అయిన 2 సర్పంచ్, 26 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలు
- నేటి నుంచి నామినేషన్లు, 19న పోలింగ్, లెక్కింపు, ఫలితాల ప్రకటన



సర్పంచ్ పదవికి ఉప ఎన్నిక జరగనున్న కొరుప్రోలు పంచాయతీ కార్యాలయం(సచివాలయం)

నక్కపల్లి: జిల్లా వ్యాప్తంగా వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు ఉప ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయించింది. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల అధికారి నీలం సహాని సోమవారం విడుదల చేశారు. ఈ నెల 8 నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లాలోని 15 మండలాల్లో రెండు సర్పంచ్ పదవులకు 26 వార్డు సభ్యుల పదవులకు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు గ్రామం, బుచ్చెయ్యపేట మండలం బుచ్చెయ్యపేట సర్పంచ్ పదవులకు ఈ నెల 19న ఎన్నికలు జరగనున్నాయి. ఇక్కడ సర్పంచ్‌లు మరణించడంతో ఉప ఎన్నికలు అనివార్యమయ్యాయి.

ఎన్నికల షెడ్యూల్

- ఈ నెల 8 నుంచి 10 వరకు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ఉంటుంది. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు దాఖలు చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.
- 11న నామినేషన్ల పరిశీలన, 12న తిరస్కరించిన నామినేషన్లపై అప్పీలు, 13 అప్పీలు పరిష్కారం ఉంటుంది.
- 14న నామినేషన్ల ఉపసంహరణ, అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్న తుది అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు.
- 19న అవసరం ఉన్న చోట ఎన్నికలు నిర్వహణ ప్రక్రియ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుంది.
- అదే రోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు, తదుపరి ఫలితాల ప్రకటన ఉంటుందని నక్కపల్లి ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు.

ఉప ఎన్నికలు జరగనున్న వార్డులు

- రాంబిల్లిమండలం కొప్పుగుండపాలెంలో(2), కుమ్మరపల్లిలో(1)
- అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం(1), మోసయ్యపేట(1), హరిపాలెం(1)
- మునగపాక మండలం మెలిపాక(1)
- నర్సీపట్నం మండలం మెట్టపాలెం(1)
- గొలుగొండ మండలం గెడ్డపాలెం(1) నాగాపురం (1)
- కే కోటపాడు మండలం ఆర్లి(1)
- చీడికాడ మండలం పెద గోగాడ(2), అప్పలరాజుపేట(1)
- నక్కపల్లి మండలం చినదొడ్డిగల్లు(1), రేబాక(1)
- ఎస్‌రాయవరం మండలం లింగరాజుపాలెం(1), చినగుమ్ములూరు(1), గుడివాడ(1)
- పాయకరావుపేట మండలం శ్రీరాంపురం(1)
- పరవాడ మండలం కన్నూరు(1)
- రావికమతం మండలం కవ్వగుంట(1) తట్టబంద(1)
- రోలుగుంట మండలం కుసర్లపూడి(1)
- దేవరాపల్లి మండలం నాగయ్యపేట(1), ఎన్‌సీ నగరం(1)

దీనికి సంబంధించిన ఏర్పాట్లను అధికార యంత్రాంగం ఇప్పటికే పూర్తి చేసింది. ఈ ఉప ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితా, పోలింగ్ బూత్‌లు తదితర ప్రక్రియను గతంలోనే పూర్తి చేసినట్టు అధికారులు తెలిపారు. నక్కపల్లి మండలంలో రెండు వార్డులకు గాను ఉప ఎన్నికలు నిర్వహించేందుకు నోటిఫికేషన్ విడుదలయిందని ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏవో సీతారామరాజులు తెలిపారు.

ఓటర్ల జాబితా సర్వేపై విచారణ


ఓటరు జాబితాలో తొలగింపునకు గురైన రిటైర్డు వీఆర్వోను విచారిస్తున్న ఆర్వో ప్రమీలా గాంధీ

రోలుగుంట: మండలంలో కొవ్వూరు పంచాయతీలో ఓటరు జాబితాలో తొలగింపునకు గురైన ఓటర్లను చోడవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి.ప్రమీలాగాంధీ విచారించారు. సోమవారం మధ్యాహ్నం ఆమె తహసీల్దార్ కె.వరహాలుతో కలసి గ్రామానికి వెళ్లారు. ఓటరు జాబితాలో 13 మంది చనిపోయినట్టుగా తొలగించారని 19, 20 పీఎస్‌లకు చెందిన బీఎల్వోలు ప్రభావతిపై ఇటీవల కొంతమంది ఫిర్యాదు చేశారు. ఆ మేరకు ఫిర్యాదులో పేర్కొన్న 13 మంది ఇళ్లకు వెళ్లి వారు చనిపోలేదని నిర్ధారించారు. ఫారం –6 నమోదు ద్వారా వారి ఓటుహక్కు పునరుద్ధరిస్తామని, ఆందోళన చెందొద్దని సూచించారు. ఈ సర్వేలోకాని, బతికున్న వారి ఓట్ల తొలగింపులో ఏ విధమైన రాజకీయ కారణాలు లేవన్నారు. నివేదికను తదుపరి చర్యల కోసం కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టికి అందిస్తానన్నారు.

క్లౌడ్ కంప్యూటింగ్ సర్టిఫికెట్లతో ఉపాధి



వర్క్‌షాపులో మాట్లాడుతున్న పూర్ణప్రియ

అనకాపల్లి టౌన్: అమెజాన్ వెబ్ సర్వీసెస్ వర్క్‌షాపు ద్వారా క్లౌడ్ కంప్యూటింగ్ సర్టిఫికెట్లు సంపాదించుకోవచ్చని డైట్ కళాశాల సీఈసీ విభాగాధిపతి పి.పూర్ణప్రియ తెలిపారు. స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక కళాశాల ఆవరణలో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమాన్ని సీఈసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠరావు మాట్లాడుతూ క్లౌడ్ కంప్యూటింగ్ సర్టిఫికెట్లు విద్యార్థుల ఉపాధి అవకాశాలకు దోహదపడతాయన్నారు. ఈ వర్క్‌షాపు ఏడు రోజులపాటు కొనసాగుతుందని చెప్పారు. రిసోర్స్‌పర్సన్ జె.లోవబాబు మాట్లాడుతూ అమెజాన్ వెబ్ సర్వీసెస్‌లో లోడ్ బ్యాలెన్సింగ్, వెబ్‌సైట్ హోస్టింగ్, క్రియేషన్ ఆఫ్ డేటా బేస్ వంటి వాటి ద్వారా వివిధ టెక్నిక్స్‌ని విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

వచ్చే నెల 2న జయహో యాత మహాసభ

ఏపీ యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత


చిట్టిబోయినపాలెంలో యాత సామాజిక వర్గీయుల ఐక్యత ప్రదర్శిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): యాత సామాజిక వర్గం ఐక్యతను చాటుతూ వారి సమస్యల పరిష్కారం కోసం వచ్చే నెల రెండో తేదీన జయహో యాత మహా సభ నిర్వహిస్తున్నట్టు ఆంధ్రప్రదేశ్ యాత కార్పొరేషన్ చైర్మన్ పిల్లి సుజాత అన్నారు. అచ్యుతాపురం మండలంలోని ఇరువాడ పంచాయతీ పరిధిలోని చిట్టిబోయిన పాలెంలో సోమవారం నిర్వహించిన యాత సామాజిక వర్గీయుల సమావేశంలో ఆమె మాట్లాడారు. యాతలను ఎస్టీల జాబితాలో చేర్చాలని ఆమె కోరారు. ఉత్తరాంధ్ర యాత సాంస్కృతిక సేవా సంఘం అధ్యక్షుడు పిల్లి నూకరాజు మాట్లాడుతూ అచ్యుతాపురంలో వచ్చే నెల రెండో తేదీన పది వేల మందితో జయహో యాత మహాసభల్ని నిర్వహిస్తామన్నారు. పాఠశాల సమయంలో శెట్టి బలిజీయులుగా రికార్డులో నమోదు చేసుకున్న వారు యాత సామాజిక వర్గీయులుగా మార్చుకోవాలని సూచించారు. ప్రతి మండల కేంద్రలోనూ, ఉత్తరాంధ్ర పరిధిలోనూ యాత సమావేశ భవనాలకు స్థలాలు కేటాయించాలని కోరారు. మద్యానికి బానిసైన వారిని ఆ వ్యసనం నుంచి విముక్తి పొందేలా కృషి చేసే స్త్రీమూర్తులకు పది వేల రూపాయల బహుమతి ఉత్తరాంధ్ర యాత సంక్షేమ సేవా సంఘం అందిస్తుందని తెలిపారు. పెంకె మారేశ్, పిల్లి శ్రీనివాసరావు, రంగాల నాగు, పిల్లి శ్రీను, పిల్లి రమణ, త్రినాథ, వడిసెల రమణమూర్తి, సిద్దిబోయిన అప్పలరాజు, నాగలి శ్రీను, లావేటి నాగరాజు, పిల్లి రమణ, వడిసెల మాణిక్యం, వడిసెల శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యంపై ఫిర్యాదు


కొరెడ్ల పెంటారావు

మునగపాక: మండలంలోని చెర్లోపాలెం గ్రామానికి చెందిన యువకుడి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మహమ్మద్ ఆలీ షరీఫ్ సోమవారం తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కొరెడ్ల పెంటారావు (35) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 15న అచ్యుతాపురంలో ప్రయివేటు కంపెనీలో చేరాడు. ఈ నెల 5న విధులు ముగించుకుని రాత్రికి ఇంటికి చేరుకున్నాడు. మద్యానికి బానిసైన పెంటారావుకు భార్య వరలక్ష్మి మధ్య కొంతసేపు వివాదం నెలకొంది. ఈ నెల 6న ఉదయం తన బైక్‌పై పొలానికి వెళ్లాడు. అక్కడ తన బైక్, సెల్‌ఫోన్ వదిలేసి కనిపించకుండా పోయాడు. దీంతో ఆందోళనకు గురైన భార్య, కుటుంబ సభ్యులు రెండు రోజుల పాటు వెతికినా ఆచూకీ లేకపోవడంతో సోమవారం సాయంత్రం పోలీసులను ఆశ్రయించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

లైంగిక దాడి కేసులో రెండేళ్ల జైలు

విశాఖ లీగల్: యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.పది వేల జరిమానా విధిస్తూ నగరంలోని పోక్సో నేరాల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి జి.ఆనంది సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించకుంటే అదనంగా 15 రోజుల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని ఆ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ కరణం కృష్ణ వివరాల ప్రకారం.. కాకినాడకు చెందిన నిందితుడు బొమ్మిడి మహాలక్ష్మి అలియాస్ రాజు (24) పాడేరులో డ్రైవర్‌గా పనిచేసేవాడు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం చుక్కల వీధికి చెందిన బాధితురాలు(17) అదే మండలం గుత్తులపాడు హైస్కూలులో పదో తరగతి చదివేది. ఆమెతో పరిచయం ప్రేమగా మారింది. 2021 జూన్ 2న పాడేరు బస్టాండ్ నుంచి చిలకలూరిపేటకు తీసుకెళ్లి నిందితుడు ఆమె ను లోబర్చుకున్నాడు. దీంతో బాధితురాలు హుకుంపేట పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఏఎస్పీ తుషార్ కేసు దర్యాప్తు చేసి నేరాభియోగ పత్రాన్ని దాఖలు చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడి మృతి


మృతుడు గంగబాబు(ఫైల్)

మాకవరపాలెం: మండలంలోని తామరం గ్రామానికి చెందిన మనబాల గంగబాబు(36) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. గ్రామంలోని చెరకు కాటా వద్ద ఆటో మెకానిక్‌గా పనిచేస్తున్న అతడు ఇటీవల నూతనంగా ఓ ఇంటిని నిర్మించుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి నిర్మాణంలో ఉన్న ఇంటి పిల్లర్లను మోటారుతో తడుపుతున్నాడు. అయితే మోటారుకున్న విద్యుత్ తీగ నీటిలో ఉండటంతో గంగబాబు షాక్‌కు గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించినట్టు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య, 4, 5 తరగతులు చదువుతున్న ఇద్దరు పిల్లలు ఉన్నారు. గంగబాబు కష్టంతోనే జీవిస్తున్న వీరంతా పెద్దదిక్కు కోల్పోవడంతో కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అర్జీదారులను సంతృప్తి పరిచేలా పరిష్కారం

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- జగనన్నకు చెబుదాంకు 327 అర్జీలు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, జేసీ జాహ్నవి, డీఆర్వో వెంకటరమణ



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

తుమ్మపాల: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను వేగంగా పరిష్కరిస్తూ అర్జీదారులు సంతృప్తి పడే విధంగా సమాధానాలు ఇవ్వాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో ప్రజల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి అర్జీపై అధికారులు దృష్టి సారించాలని నిష్పక్షపాతంగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించి అర్జీదారును సంతృప్తి చేయాలన్నారు. ప్రతి అర్జీపై ఆయా శాఖల అధికారులు నేరుగా ఫిర్యాదుదారుతో మాట్లాడాలన్నారు. ఈ వారం మొత్తం 327 అర్జీలు నమోదయ్యాయి. జేసీ ఎం.జాహ్నవి, అసిస్టెంట్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, డీఆర్వో పి.వెంకటరమణ, డ్వామా పీడీ సందీప్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.


ఈ వారం వచ్చిన సమస్యల్లో కొన్ని..

- తన భర్త మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని అనకాపల్లి మండలం శంకరం గ్రామానికి చెందిన మిరియాల వెంకట జగదీశ్వరి జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్‌కు విన్నవించింది. తన భర్త మిరియాల దేవివెంకట జోగేశ్వర శర్మ మే 14న అనారోగ్యంతో ముంబై ఎయిర్‌పోర్టులో మరణించారని, అత్యంత వ్యయప్రయాసలతో గ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు చేశామన్నారు. ఈ నేపథ్యంలో మరణ ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలంటే కలెక్టర్ అనుమతించాలని పంచాయతీ కార్యదర్శి చెప్పారని వాపోయింది.
- చెర్లోపల్లి కాలువ వ్యర్థాలను పూర్తిగా తొలగించి 1,500 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందించే లా అధికారులు చర్యలు తీసుకోవాలని అనకాపల్లి ప ట్టణ రైతులు కలెక్టర్‌కు విన్నవించారు. పూర్తిగా వ్య ర్థాలతో నిండిన కాలువ ద్వారా నీరు పారకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.
- ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు పెంచిన ఈడీ, కస్టమర్, ట్రూఅప్, ఇంధన సర్దుబాటు చార్జీలను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఏపీ స్టేట్ ఫెర్రో అల్లాయిస్ వర్కర్స్ కో ఆర్డినేటర్ కమిటీ సభ్యులు కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. వారి సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.
- ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నం సర్వే నెం.506లో పట్టాలు ఇచ్చిన 23 మందికి సర్వే చేసి భూముల అప్పగించాలని వాకపాడు, వేమగిరి గ్రామస్తులు కలెక్టర్‌ను కోరారు. బంగారమ్మపాలెంలో సాగులో ఉన్న 130 మంది మత్స్యకార రైతులకు పట్టాలు మంజూరు చేసి న్యాయం చేయాలని విన్నవించారు.

చట్ట పరిధిలో సమస్యలు పరిష్కరించాలి: ఎస్పీ

అనకాపల్లి టౌన్: చట్ట పరిధిలో సమస్యలను పరిష్కరించాలని పోలీసు అధికారులను ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశించారు. తన కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 37 అర్జీలను ఆయన స్వీకరించారు. వీటిపై నిర్ణీత సమయంలో నివేదిక అందించాలని అధికారులకు సూచించారు. అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్.బి. ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్‌ఐ చక్రధర్ పాల్గొన్నారు.

ఫిర్యాదు చేస్తే చంపుతానని బెదిరిస్తున్నాడు...



నాపేరు పి.పద్మ, మాది రాంబిల్లి మండలం గోవిందపా లెం గ్రామం. గ్రామంలోని సర్వే నంబర్ 175లో రెండు సెంట్ల స్థలంలో నేను రేకుల షెడ్డు నిర్మించుకున్నా. మా గ్రామానికి చెందిన కారే త్రినాథ్ గత నెల 21న రాత్రి రేకుల షెడ్డ షట్టర్లను దొంగలించాడు. ఈ విషయంపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. దాంతో తనపై ఫిర్యాదు చేశానన్న కోపంతో అతడు అసభ్య పదజాలంతో దూషించి చంపుతానని బెదిరిస్తున్నాడు. అయినప్పటికీ పోలీసులు నిందితుడిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. వెంటనే నాకు న్యాయం చేయాలని కోరుతున్నాను.

అగ్రిల్యాబ్స్‌లో నాణ్యతా పరీక్షలపై శిక్షణ


ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న బి.మోహనరావు

తుమ్మపాల: ఇంటిగ్రేటెడ్ అగ్రిల్యాబ్స్ ద్వారా విత్తన, ఎరువులు, మట్టి పరీక్షలు సక్రమంగా చేయడం వల్ల రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు అన్నారు. పట్టణంలో వైఎస్సార్ ఐఏఎల్ అగ్రిల్యాబ్‌లో అనకాపల్లి, చోడవరం, యలమంచిలి, వి.మాడుగుల, పాయకరావుపేట, భీమిలి, రంపచోడవరం, అరకు, పాడేరు ప్రాంతాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7,8 తేదీలలో విత్తన నాణ్యత పరీక్షలు, 9,10,11 తేదీలలో ఎరువుల నాణ్యత పరీక్షలు, 14వ తేదీన మట్టి నాణ్యత పరీక్షలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. మొదటి రోజు విత్తన రిజిస్ట్రేషన్, విత్తన శుద్ధి, విత్తన తేమ శాతం పరీక్ష, విత్తన మొలక శాతం పరీక్షలతో పాటు ఇన్‌సైట్ యాప్ నమోదు వంటి అంశాలపై అవగాహన ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు రామారావు, రాజ్‌కమల్, ఐఏఎల్ ఏవో కె.ధనలక్ష్మి, ఆయా మండలాల ఏవోలు, సిబ్బంది పాల్గొన్నారు.

తంతడి తీరంలో 'రాంబో' సందడి


హీరో శ్రీతేజ, హీరోయిన్ ఫర్నాజ్ శెట్టి

అచ్యుతాపురం(అనకాపల్లి): శ్రీతేజ, ఫర్నాజ్ శెట్టి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న రాంబో చిత్ర షూటింగ్‌తో అచ్యుతాపురం మండలంలోని తంతడి తీరం సోమవారం సందడిగా మారింది. రెండు రోజులుగా ఇక్కడి తీర ప్రాంతంలో సినిమాకు సంబంధించిన కీలక సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఎస్‌వీకే సీ–సాయి విఘ్నేష్ కార్తీక్ సినిమా బ్యానర్‌పై, గంగపట్నం శ్రీధర్ నిర్మాతగా, రత్నకరం అనిల్ రాజు దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

పోటీతత్వంతోనే మెరుగైన సైన్స్ ప్రాజెక్టులు

తుమ్మపాల: స్థానిక సమస్యలకు పరిష్కారం చూపుతూ తయారు చేసిన ప్రాజెక్టులు జాతీయ స్థాయి సైన్స్ పోటీలకు వెళ్లే అవకాశం ఉంటుందని జిల్లా సైన్స్ అధికారి కె.ప్రసాదరావు అన్నారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం సైన్స్ ఉపాధ్యాయుల ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతోనే ప్రయోజనకరమైన ప్రాజెక్టులను రూపొందించగలరన్నారు. ఎంపికైన ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం రూ.10 వేలు విద్యార్థుల ఖాతాలకు జమ చేస్తుందన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల నుంచి 3 ప్రాజెక్టులు, ఉన్నత పాఠశాల నుంచి 5 ప్రాజెక్టులు ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయాలన్నారు. ఎంఈవో కె.చిట్టిబాబు, రిసోర్స్ పర్సన్ ఏవీ రాజగోపాల్, గిరి వరప్రసాద్, బీఎన్ మూర్తి, ఎస్.బాబురావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిండుగా ఏలేరు కాలువ



తాళ్లపాలెం వద్ద ఏలేరు కాలువ ఉధృతి

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వద్ద ఏలేరు కాలువ ప్రవాహం సోమవారం ఉధృతంగా కనిపించింది. వైజాగ్ స్టీల్‌ప్లాంట్, తాగునీటి అవసరాలకు ఏర్పాటు చేసిన ఏలేరు కాలువకు ఇటీవల మాకవరపాలెం రాచపల్లి వద్ద గండి పడిన విషయం తెలిసిందే. దీంతో ప్రవాహ వడి, నీటి మట్టం బాగా తగ్గింది. గండి పూడ్చిన నేపథ్యంలో నీటి మట్టంతోపాటు ప్రవాహ వేగం కూడా పెరిగింది. దీంతో స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

ఉపకార వేతనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

అనకాపల్లిటౌన్: ప్రతిభగల గవర, ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించనున్నట్లు గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసిరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సంవత్సరంలో పాలిటెక్నిక్, ఐటీఐ, ఈ క్యాట్, ఇంజినీరింగ్, మెడిసన్, బీడీఎస్, ఐఐటీ, ఎన్ఐటీ తదితర ప్రవేశ పరీక్షల్లో మంచి ర్యాంకు సాధించిన విద్యార్థులు ఉపకార వేతనాల కోసం తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సెప్టెంబర్ 5లోగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

తగ్గిన టమాటా ధర



వారపు సంతలో కొనుగోలుదారులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో టమాటా ధర ఒకేసారి భారీగా తగ్గింది. గత వారం కిలో రూ.200కు విక్రయించగా, ఈ వారం కిలోకి రూ.80 తగ్గి రూ.120కి విక్రయాలు సాగాయి. దీంతో ప్రజలు కాస్త ఊరట చెందారు. వచ్చే వారానికి ధరలు మరింతగా తగ్గే అవకాశాలున్నట్లు వ్యాపారులు చెప్తున్నారు. చిత్తూరులో టమాటా ఉత్పత్తి క్రమేపీ పెరుగుతుండటంతో ధర తగ్గిందన్నారు. పాదు చిక్కుడు కిలో రూ.150కి అమ్మకాలు జరిగాయి. ఉల్లిపాయ రూ.25, బంగాళాదుంప, క్యాబేజీ రూ.30, క్యారెట్, బీట్రూట్, బెండకాయ, కాకర కాయ, వంకాయ, దొండకాయ, బరబాటి, గోరు చిక్కుడు రూ.60, క్యాప్సికం రూ.100కు విక్రయాలు జరిగాయి.

అనకాపల్లి సినిమాలు

బేబి : రాజా
మెగ్ 2 : సత్యనారాయణ స్క్రీన్-1
సూర్య S/O కృష్ణన్(మార్నింగ్, మ్యాట్నీ షోలు)
దిల్‌సే : సత్యనారాయణ స్క్రీన్-2
కృష్ణగాడు అంటే ఒకరేంజ్ : షిర్డిసాయి
బ్లడ్-చాక్లెట్ : పర్తిసాయి
ఎల్‌జీఎం(లెట్స్ గెట్ మ్యారీడ్) : వెంకటేశ్వర
అన్నపూర్ణ ఫొటో స్టూడియో : శ్రీసత్య
బ్రో : రామచంద్ర

బెల్లం ధరలు

అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు సోమవారం 152 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,100	4,260
రెండో రకం	3,980	4,050
మూడోరకం	3,850	3,950

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 58 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-26 యూనిట్లు, ఓ పాజిటివ్-22 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 217 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 304 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

యజ్ఞంలా జగనన్న సురక్ష

- ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తి
- మండలంలో 22,531 ధ్రువపత్రాల జారీ
- ఇంటి తలుపు తట్టి మరీ అందించిన వైనం



మహిళకు ధ్రువపత్రం అందిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి(ఫైల్)

చిన్న చిన్న సాంకేతిక సమస్యలు, ధ్రువపత్రాల్లేవనే కారణంతో అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ లబ్ధికి దూరం కారాదు. సమస్య తెలుసుకుని మరీ సంక్షేమాన్ని అందించాలి. అదే ఆలోచనతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టారు. ఆ ఫలాలు మండలంలో వేల కుటుంబాలకు చేరాయి. పేదల మనసెరిగిన నేత అంటూ సీఎం జగన్‌ను జనాలు వేనోళ్ల కీర్తించేలా చేసిందీ.. జగనన్న సురక్ష.

అనకాపల్లి రూరల్: దేశంలో ఏ రాష్ట్రంలోనూ, ఏ ప్రభుత్వమూ ఊహ మాత్రంగానైనా ఆలోచించని కార్యక్రమానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. అంతే స్థాయిలో అధికారులు దాన్ని విజయవంతం చేశారు. సాంకేతిక కారణాలతో పథకాలకు దూరమైన వారికి సంబంధిత ధ్రువపత్రాలను అందించేందుకు నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమం ఘన విజయాన్ని సాధించింది. గత నెల 1 నుంచి 27 వరకు అనకాపల్లి మండలంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 26 గ్రామ సచివాలయాల పరిధిలో దరఖాస్తు చేసుకున్న వారికి 22,531 ధ్రువపత్రాలను అందించారు.

ముందస్తు సర్వేతో 11 రకాల సేవలు

కుల, ఆదాయ, జనన, మరణ.. ఇలా ఎలాంటి ధ్రువపత్రం కావాలన్నా గతంలో రోజులు, నెలల తరబడి మండల, జిల్లా కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. కొన్నిసార్లు జేబు గుల్ల చేసుకున్నా పని జరిగేది కాదు. ఇక ఫ్యామిలీ మెంబర్, ఆరోగ్యశ్రీ, రేషన్ కార్డు వంటివి పొందడం ఒక ప్రహసనం. చివరకు అన్ని రకాల పాట్లు పడి ధ్రువపత్రాలు పొందినా ఏదో ఒక సాకు చెప్పి పథకాలకు అనర్హులుగా చూపేవారు. తాము ఫలానా పథకానికి అర్హులమని చెప్పుకున్నా వినే నాథుడు కానరాని పరిస్థితి. ఇలాంటి వారికి జగనన్న సురక్ష కార్యక్రమం శ్రీరామరక్షగా మారింది. 11 రకాల ధ్రువపత్రాలను దరఖాస్తు చేసుకున్న 7 రోజుల్లోనే ఇంటి వద్దకొచ్చి మరీ అందించారు.

ప్రత్యేక సర్వేతో గుర్తింపు

మండలంలోని సురక్ష శిబిరాలకు ముందు 26 గ్రామ సచివాలయాల పరిధిలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రత్యేక సర్వే ద్వారా ప్రతి ఇంటికీ వెళ్లారు. ప్రజల అవసరాలను తెలుసుకున్నారు. వారికి కావాల్సిన ధ్రువపత్రాల కోసం దగ్గరుండి మరీ తమ వద్దనున్న యాప్ ద్వారా దరఖాస్తు చేయించారు. వీరెవరూ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా తహసీల్దార్, ఎంపీడీవో, ఈవోపీఆర్డీలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, దరఖాస్తుల పరిశీలన జరిపారు. అర్హత ఆధారంగా ఎటువంటి రుసుము లేకుండా వాటిని ఉన్న ఊళ్లోనే అందించారు. ఎలాంటి వివక్షకు తావు లేకుండా, అత్యంత పారదర్శకంగా శతశాతం సంతృప్త స్థాయిలో సంక్షేమ పథకాలు, ప్రభుత్వ సేవలు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని అధికార యంత్రాంగం, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పూర్తి సమన్వయంతో విజయవంతం చేశారు.

మండలంలో జగనన్న సురక్షలో అందించిన సేవలు

సేవ	సంఖ్య
కుల ధ్రువీకరణ పత్రాలు:	12,852
ఆదాయ ధ్రువీకరణ పత్రాలు:	8,900
ఓబీసీ సర్టిఫికెట్లు:	213
ఆధార్ కార్డులకు ఫోన్ నంబర్ల అనుసంధానం:	345
కొత్త రేషన్ కార్డులు, రైస్ కార్డుల నుంచి కుటుంబ సభ్యుల తొలగింపు:	104
రైస్ కార్డులో కుటుంబ సభ్యుల విభజన:	14
కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు:	14
కంప్యూటరైజ్డ్ అడంగల్:	14
ఫ్యామిలీ మెంబర్ ధ్రువపత్రాలు:	22
ఆర్‌వోఆర్ 1బీ:	38
కౌలు హక్కు పత్రాలు:	2
బర్త్ సర్టిఫికెట్:	1
మ్యారేజ్ సర్టిఫికెట్లు:	2
భూముల, స్థలాల ఈసీ:	1
పెన్షన్లు:	3
మ్యుటేషన్‌లు, టైటిల్ డీడ్:	5
ఇతరములు:	1
మొత్తం:	22,531

ప్రజల చెంతకే యంత్రాంగం



సంక్షేమ పథకాల అమలులో చిన్న చిన్న ధ్రువీకరణ పత్రాలు లేక ఇబ్బంది పడుతున్న వారికి, సేకరించుకోలేని వారికి జగనన్న సురక్ష కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడింది. రోజుల తరబడి తిరిగే పరిస్థితి లేకుండా ప్రజల వద్దకే ప్రభుత్వ యంత్రాంగం వెళ్లి సేవలందించింది. సురక్ష శిబిరాల ద్వారా ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఈ కార్యక్రమం అనుకున్న దానికంటే చాలా బాగా విజయవంతమైంది.

– కేవీ నరసింహారావు, ఎంపీడీవో, అనకాపల్లి

మమ్మేలు మా తల్లి ముత్యాలమ్మ



తాళ్లపాలెం సంత వద్ద వెలసిన ముత్యాలమ్మవారు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం సంత వద్ద వెలసిన ముత్యాలమ్మ ఉత్సవం సోమవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మ వారి పుట్టుక ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తీన్‌మార్ డప్పులు, కర్ర సాములతో బాణసంచా కాలుస్తూ భక్తుల పునకాలతో తాళ్లపాలెం సంతకాలనీ నుంచి భారీ ఊరేగింపుగా గంగాదేవి అమ్మ వారి ఆలయ సమీపంలో ఉన్న పుట్ట వద్దకు తరలి వెళ్లారు. అక్కడ పూజలు చేసి అమ్మ వారి ప్రతి రూపాన్ని ఊరేగింపుగా తీసుకు వచ్చి ఆలయంలో నిలిపారు. విశేష పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు ఉత్సవం : ప్రధానమైన అమ్మవారి ఉత్సవం రెండో రోజైన మంగళవారం ఘనంగా జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉత్సవంలో భాగంగా ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు.



తీన్‌మార్ డప్పుల మోత



పుట్టుక ఉత్సవ ఊరేగింపు

ముగిసిన స్నేహ మాసోత్సవాలు



ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుంటున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: బెస్ట్ ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో జాతీయ స్నేహమాసోత్సవాలు ఆదివారం రాత్రి స్థానిక పెంటకోట కన్వెన్షన్ హాల్లో ముగిశాయి. ఉదయం నుంచి మొదలైన వేడుకల్లో సాయంత్రం వరకు క్లబ్ సభ్యులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. సభ్యులంతా పరస్పరం ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకుని, స్వీట్స్ తినిపించుకున్నారు. అంతకుముందు ఉగాది పురస్కార అవార్డు గ్రహీత పులఖండం విజయబాబు ఈలపాట ఆహూతుల్ని ఆకట్టుకుంది. పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి బహుమతులను అందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కార్యక్రమాల్లో భాగంగా క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. క్లబ్ గౌరవాధ్యక్షుడిగా పెంకోట నర్సింగరావు, చైర్మన్‌గా పి.ఎస్.అప్పారావు, అధ్యక్షునిగా బీఎస్ఎంకే జోగినాయుడు, కార్యదర్శిగా పెంటకోట ప్రభాకర్, కోశాధికారిగా భర్నికాన శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా బుద్ద శివతోపాటు మరోపదిమంది కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.

అభిప్రాయభేదాల్లేని కుటుంబం స్వర్గధామం



విద్యార్థినికి బహుమతిని అందిస్తున్న దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్: తల్లిదండ్రులు, పిల్లల మధ్య అభిప్రాయబేధాలు లేని కుటుంబం స్వర్గధామం అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. మండలంలోని మామిడిపాలెం స్కూల్ గ్రౌండ్‌లో సర్పంచ్ పూడి పరదేశినాయుడు అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రులను గౌరవిద్దాం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పిల్లలు సంతోషంగా ఉంటే చాలనుకునే తల్లిదండ్రులకు, వారి ఆనందం కోరుకునే పిల్లలుంటే ఆ కుటుంబం ఆనందమయంగా సాగిపోతుందన్నారు. ఒకస్థాయి వరకు తల్లిదండ్రులు తమ పిల్లలు చేసే అల్లరిని భరిస్తున్నారు కదా అని పిల్లలు తల్లిదండ్రులపై భారం మోపరాదన్నారు. జీవితంలో ఏది కోల్పోయినా తిరిగి పొందవచ్చుగానీ తల్లిదండ్రులను కోల్పోతే ఆ బాధ భరించరానిదన్నారు. నేటి విద్యార్థులు సెల్‌ఫోన్ వాడకం తగ్గించి విద్యపై దృష్టి సారించాలని సూచించారు. చదువుకున్న విద్యాలయానికి, పుట్టిన ఊరికి పేరు తీసుకురావాలని కోరారు. అంతకుముందు ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సీఐ దాడి మోహన్‌తో కలిసి బహుమతులందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, సైనిక్ స్కూల్ చైర్మన్ మాకవరపు పరమేశ్వరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా సైకిల్ యాత్ర



తాళ్లపాలెంలో సీఐటీయూ సైకిల్ యాత్ర

కశింకోట: మండలంలోని తాళ్లపాలెంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక, కర్షక, మహిళా వ్యతిరేక విధానాలకు నిరసనగా సోమవారం సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలను పంపిణీ చేశారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశ సమగ్రత, సమైక్యత కోసం క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఈ నెల 9న ప్రధాని మోదీని గద్దె దింపి, దేశాన్ని కాపాడుకునేందుకు కార్మిక, కర్షక, మహిళా, ఉద్యోగ, ప్రజా సంఘాలు సంఘటితం కావాలన్నారు. ఈ మేరకు ప్రజల్ని చైతన్య పరిచేందుకే సైకిల్ యాత్ర చేట్టినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎం.సత్తిబాబు, ఎన్.నాగరాజు, బి.నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ ముందస్తు వేడుకలు



వ్యాసరచన పోటీలకు హాజరైన విద్యార్థులు

అనకాపల్లిటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ 88వ ఆవిర్భావ దినోత్సవ ముందస్తు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నేటి సమాజం–విద్యార్థుల పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అంతకు ముందు ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.ఫణీంద్రకుమార్ మాట్లాడుతూ సమాజ ప్రగతిలో విద్యార్థులు ఎంతో కీలకమన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యం, ఆశయ సాధనకు పోరాడేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విజేతలకు ఈ నెల 12న ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని బహుమతుల్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బాబ్జీ, సహాయ కార్యదర్శి సతీష్, రమేష్, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షయ రోగులకు పోషకాహార కిట్ల పంపిణీ



క్షయ రోగులకు పోషకాహార కిట్లు అందిస్తున్న ఎంపీపీ సూరిబాబు, వైద్యాధికారి షమీమ్

అనకాపల్లి రూరల్: ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం తుమ్మపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో క్షయ రోగులకు పోషకాహార కిట్లను ఎంపీపీ గొర్లి సూరిబాబు పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ నిర్మూలనలో భాగంగా రోగులకు పోషకాహారం అందించేందుకు ప్రతి నెల ఉచితంగా వివిధ ఆహార ధాన్యాలు, పప్పు దినుసులు మొదలైన సరుకులతో ఉన్న కిట్లను అందిస్తోందన్నారు. ఆస్పత్రి వైద్యాధికారిణి ఎస్‌కే నజ్రత్ షమీమ్ మాట్లాడుతూ క్షయ రోగులు మందులను క్రమం తప్పకుండా వాడుతూ, పోషకాహారాన్ని తీసుకుంటే త్వరగా కోలుకుంటారని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో జమ్ము శ్రీనివాసరావు, ఎంపీహెచ్ఎస్‌లు బి.సంగం, ఎం.మాణిక్యాంబిక, ఎం.పెంటయ్య, బి.సత్యసుధ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ ఆలయ వార్షికోత్సవం

కశింకోట: మండలంలోని ఏఎస్ పేటలో మరిడిమాంబ అమ్మవారి వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని, పూజలు చేశారు. చీరలు, రవికెలు, అరటి గెలలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఆస్పత్రిలో మౌలిక వసతులకు ప్రాధాన్యత

ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీపీ సూరిబాబు



ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో వసతులపై చర్చిస్తున్న ఎంపీపీ సూరిబాబు, అధికారులు

అనకాపల్లి రూరల్: మండలంలోని తుమ్మపాల పీహెచ్‌సీలో వైద్యసిబ్బందికి, రోగులకు పలు సదుపాయాలు కల్పించాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ తీర్మానించింది. సోమవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆస్పత్రి సమస్యలపై చర్చించారు. ఆపరేషన్ థియేటర్‌లో వైద్యసిబ్బందికి, రోగులకు అవసరమైన సౌకర్యాలను వెంటనే కల్పించాలని ఎంపీపీ సూచించారు. ఆస్పత్రిలో అవసరమైన మేర ఎలక్ట్రికల్ వైరింగ్ పనులు చేపట్టాలన్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల సిబ్బంది ఆదరణ చూపాలన్నారు. ఆస్పత్రి ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రజలు రోగాల బారిన పడకుండా ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు గ్రామాల్లో తిరుగుతూ వారిని చైతన్యపరచాలని సూచించారు. సమావేశంలో మెడికల్ ఆఫీసర్ నజరత్ షమీమ్, ఎంపీడీవో కేవీ నర్సింహారావు, తహసీల్దార్ పీవీఎల్ఎన్ గంగాధరరావు, ఈవోపీఆర్డీ ధర్మారావు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి చంద్రశేఖర్, సర్పంచ్ తట్ట పెంటయ్యనాయుడు, ఎంపీటీసీ పన్నీరు బుజ్జి వెంకటలక్ష్మి, మండల కో ఆప్షన్ సభ్యుడు బొండా అప్పలరాజు, జమ్ము శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యానికి సన్నద్ధం



అచ్చెర్లలో చిరు ధాన్యాల సాగుతో సారవంతం చేసిన భూమిలో ఏపుగా ఎదిగిన వరి నారుమడి



అడ్డాంలో చిరు ధాన్యాల మొక్కలను ట్రాక్టర్‌తో కలియదున్ని సాగుకు సిద్ధం చేస్తున్న రైతు

కశింకోట: మండలంలోని అచ్చెర్ల, అడ్డాం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా భూమిని సారవంతం చేసి వరి సాగు చేపట్టారు. ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పంపిణీ చేసిన 30 రకాల చిరు, నవ ధాన్యాల విత్తనాలను నాటారు.

అవి ఏపుగా ఎదగడంతో భూమి సారవంతానికి వాటిని నేలలో కలియదున్నారు. కొంత భూమిలో వరి నారుమళ్లు వేశారు. అది ఏపుగా పెరిగింది. దీంతో మిగిలిన భూమిని కూడా దున్ని వరి నాట్లు వేసేందుకు రైతులు సిద్ధం చేస్తున్నారు. సుందరయ్యపేట, ఆనందపురం, జి.భీమవరం, తాళ్లపాలెం, చెరకాం, మోసయ్యపేట తదితర గ్రామాల్లో కూడా రైతులు ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి సాగుకు సన్నద్ధమయ్యారు.

సాయిబాబా మందిర వార్షికోత్సవానికి అంకురార్పణ



సాయిబాబా మందిర వార్షికోత్సవ అంకురార్పణకు పసుపు, కుంకుమ సేకరిస్తున్న ధర్మకర్త

కశింకోట: మండలంలోని పల్లపు సోమవరం గ్రామంలో ప్రసిద్ధి చెందిన సాయిబాబా మందిర వార్షికోత్సవానికి సోమవారం అంకురార్పణ చేశారు. ఈ నెల 25న భారీ ఎత్తున వార్షికోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా పసుపు, కుంకుమలతో ఉత్సవానికి శ్రీకారం చుట్టారు. ఆలయ ధర్మకర్త గొంతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ గొంతిన నాగరత్నం, పాల సంఘం అధ్యక్షుడు గూడెపు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వారపు సంతలో మలుగు పాము చేప




తాళ్లపాలెం వారపు సంతలో అమ్మకానికి 3 అడుగుల పెద్ద చేప



చేపను ఆసక్తిగా తిలకిస్తున్న కొనుగోలుదారులు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంతలో సుమారు మూడు అడుగుల పొడవున్న చేప కొనుగోలుదారుల్ని ఆకట్టుకుంది. ఇది మలుగు పాము చేప అని అమ్మకందారులు పేర్కొన్నారు. సమీపంలోని శారదానది, దాని ఉప కాలువల్లో సహజంగా లభ్యమయ్యే రొయ్యలు, బొమ్మిడాలు, బొచ్చులు, మట్టగిడసలు, మార్పులు, కొరమేను తదితర రకాల చేపలను పట్టి సంతకు తెచ్చి విక్రయిస్తుంటారు. ఇవి సహజంగా పెరిగినవి కావడం, రుచిగా ఉంటాయని భావించి సంతకు వచ్చే ప్రజలు ఎక్కువగా కొనుగోలుకు ఆసక్తి చూపుతారు. ఈసారి భారీ మలుగు పాము చేప లభ్యం కావడంతో విక్రయానికి పెట్టారు. అరుదుగా సంతకు వచ్చే చేప కావడంతో కొనుగోలుదారులు ఆసక్తిగా తిలకించారు. రూ.700కు దీన్ని విక్రయించినట్లు తెలిసింది.

యాజమాన్య పద్ధతులతో మేలైన దిగుబడులు



మాట్లాడుతున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు

అనకాపల్లి రూరల్: మండలంలోని కూండ్రం రైతు భరోసా కేంద్రంలో సోమవారం డివిజనల్ వ్యవసాయాధికారి ఎం.రామారావు ఆధ్వర్యంలో పంటల సాగుపై రైతులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ మేలైన దిగుబడులు సాధించాలంటే వ్యవసాయాధికారులు చెప్పిన యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా కావాల్సిన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతు శిక్షణా కేంద్రం ఏడీ శ్రీధర్, వ్యవసాయ శాస్త్రవేత్త రామలక్ష్మి వ్యవసాయ పథకాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కేవీ నర్సింహారావు, ఈవోపీఆర్డీ ధర్మారావు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ అప్పారావు, ఏవో పీయూబీపీ రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం

అనకాపల్లిటౌన్: పట్టణంలో గవరపాలెం జీవీఎంసీ హైస్కూల్ 1986–87 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు సోమవారం స్నేహితుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు 100 మంది విద్యార్థులు ఓ చోట చేరి, పరస్పరం ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకున్నారు. ఒకరికొకరుస్వీట్లు తినిపించుకుని, ఆనందోత్సాహాల మధ్య సాయంత్రం వరకు గడిపారు.

సమస్యల పరిష్కారానికి మున్సిపల్ కార్మికుల ఆందోళన



జోనల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

అనకాపల్లి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ పర్మినెంట్, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, క్లాప్ డ్రైవర్స్, వాటర్ వర్క్స్, కార్మికుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, రిటైర్మెంట్, అనారోగ్యాలకు గురైన వారి పోస్టులను వారసుల ద్వారా భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ఉపాధ్యక్షుడు గంటా శ్రీరామ్, బొమ్మల రాము, వాసు, శేఖర్, శివకుమార్, అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.